

ఉలికిపాటు!



ఏసీబీ దాడులు పెరుగుతుండటంతో ప్రభుత్వ అధికారుల్లో అలజడి

- ఏడాదిన్నరలో ఉమ్మడి జిల్లాలో 18 మంది లంచావతారుల పట్టివేత
- అవగాహన పెరుగుతుండటం వల్ల ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు
- దాడులతోనే సరిపెట్టకుండా ఆకస్మిక తనిఖీలు చేస్తున్న అధికారులు
- లంచం అడిగితే 1064ను ఆశ్రయించాలంటున్న అవినీతి నిరోధక శాఖ

ప్రభుత్వ కార్యాలయమంటేనే పైసలిస్తేనే పని... లేదంటే చెప్పులరిగేలా తిరిగినా స్పందన ఉండదు... ఇదంతా ఎందుకని.. అడిగిన దాంట్లో అంతో ఇంతో చదివించుకోవడం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారిలో కనిపిస్తున్న తంతు. కానీ ప్రజల్లో అవినీతిపై అవగాహన పెరగడంతో తప్పుడు పనికి మినహా న్యాయంగా అధికారులు చేయాల్సిన పనికి ఎందుకు డబ్బులివ్వాలనే ప్రశ్న తలెత్తుతోంది. దీంతో బాధితులు తమ చైతన్యాన్ని బట్టి ఏసీబీ అధికారులకు సమాచారం ఇస్తున్నారు. ఆ మేరకు వారు దాడులు నిర్వహిస్తున్నారు. దీంతో అవినీతికి ఎక్కువగా ఆస్కారముంటే రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్‌టీవో, పోలీసు, రెవెన్యూ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో లంచావతారులు వెనుకముందు చూసుకొని మాత్రమే తమ పని కానిస్తున్నారు. లేదంటే దండన తప్పే పరిస్థితి లేదు. ఏడాదిన్నరగా పెరిగిన ఏసీబీ కేసులే ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

మహబూబ్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిబంధనల ప్రకారం ఉండాల్సిన పత్రాలు లేకున్నా, అక్రమ అనుమతులు ఇవ్వడానికో, అన్నీ ఉన్నా తమ పనికి కొర్రీలు పెట్టి ఆపకుండా చేయడానికో, పని అనుకున్న సమయం కంటే తొందరగా కావడానికో ప్రజల నుంచి కొందరు అధికారులు లంచాలు డిమాండ్ చేస్తుంటారు. అడిగినంత ఇవ్వకపోతే ఎక్కడ పనిచేయరోననే భయాన్ని ఆసరాగా చేసుకొని లక్షల్లో ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతున్నా అందినకాడికి దోచుకుంటారు. ఆ లంచగొండుల బారిన పడుతున్న వారు గుట్టుచప్పుడు కాకుండా ముట్టజెప్పి తమ పని చేసుకుంటున్నారు. అలా ఇచ్చుకోలేని వారు ప్రస్తుతం నేరుగా ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. గతంలో ఏడాదిలో ఒకటి రెండు కేసులు అయితేనే ఆ భయం కొన్ని నెలలపాటు అధికారుల్లో ఉండేది. కానీ గత సంవత్సరంన్నరలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏకంగా ఏసీబీకి 18 మంది లంచావతారులు చిక్కారు. ఇందులో జిల్లా ఉన్నతాధికారుల నుంచి మొదలుకొని కిందిస్థాయి ఉద్యోగుల వరకు అందరూ ఉన్నారు. ఏసీబీ దాడులు పెరుగుతుండటంతో లంచం అడిగే అధికారులు నమ్మకమైన మధ్యవర్తులను నియమించుకోవడమో లేదా లంచాలకు దూరంగా ఉంటున్నారు. ప్రజల్లో ఏసీబీపై పెరుగుతున్న అవగాహనతోనే ఇదంతా సాధ్యమవుతోంది. గతంలో ఇన్ని దాడులు జరగకపోవడానికి ఒకటి ప్రభుత్వం లంచావతారుల పట్ల ఉదాసీన వైఖరితో వ్యవహరించడం



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వనపర్తి విద్యుత్ ఎస్ఈ నాగేంద్రకుమార్, డీఈ నరేంద్రకుమార్, ఏఈ మధుకర్ (ఫైల్)

లేదా ప్రజల్లో అవగాహన తక్కువగా ఉండటమో కారణంగా చెప్పవచ్చు. ఏసీబీ అధికారులు కూడా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి చెబితే చాలు తాము దాడులు చేసి పట్టుకుంటామని హామీ ఇస్తున్నారు. దాడులు పెరగడంతో ఒకవైపు అధికారులు ఉలికిపాటుకు గురవుతుండగా మరోవైపు ప్రజలకు భరోసా ఏర్పడుతోంది.

● చైతన్యం పెరిగితేనే కట్టడి

పనిచేసి పెడితే లంచం ఇవ్వాలని ఏ అధికారి అడిగినా వెంటనే ఎందుకివ్వాలి. ఈ పని చేసేందుకే కదా ప్రభుత్వం వేతనం ఇస్తున్నదనే ప్రశ్న మొదలైనపుడు ఈ లంచాలకు నియంత్రణ ఉంటుందనే అభిప్రాయం ఉన్నది. అలాగే లంచం తీసుకోవడం ఎంత నేరమో, లంచం ఇవ్వడమూ అంతే నేరమని తెలిస్తే కూడా అవినీతికి (మిగతా 6లో..)

పోలీసులు

బాధ్యతగా పనిచేయాలి

- గద్వాలలో పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన డీఐజీ చౌహాన్



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఐజీ 7

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర స్థాయి

బాస్కెట్‌బాల్ పోటీలు

7

- తలపడిన 17 మహిళా జట్లు, 18 పురుషుల జట్లు



పోటీలో తలపడుతున్న సూర్యాపేట, వికారాబాద్ మహిళల జట్లు

వన్యప్రాణుల సంరక్షణే

ధ్యేయంగా పని చేయాలి

- డీఎఫ్‌వో రోహిత్ గోపిడి
- రెస్క్యూ బృందాలకు తుపాకీ మత్తుమందు బుల్లెట్లపై ముగిసిన శిక్షణ

6



సిబ్బందికి అవగాహన తరగతులను నిర్వహిస్తున్న శిక్షణాధికారులు

జోగులాంబను దర్శించుకున్న

హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి గోపాలకృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అలంపూరు జ్యుడిషియల్ కోర్టు న్యాయాధికారి మిథున్‌తేజ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కాషాయ పార్టీకి ఏజెంట్‌గా ఎన్నికల కమిషన్

- బిహార్ ఎన్నికల్లో ఓడిపోతామని తక్కువ సమయంలో ఓట్ల సవరణ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఆత్మకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అధికారంలో ఉన్న కాషాయ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. అమరచింత పట్టణ కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బిహార్ ఎన్నికల్లో ఓడిపోతామని ముందుగా పసిగట్టిన బీజేపీ, తక్కువ సమయంలోనే పూర్తి ఓట్ల సవరణను నిర్వహించేలా ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించారని ఆరోపించారు. ఓట్ల జాబితా నుంచి 52 లక్షల ఓట్లను తొలగించాలని నిర్ణయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రతిపక్షాలు ఐక్యమయ్యాయని, పార్లమెంట్ సమావేశంలో కీలక చర్చల సమయంలో ప్రధాని గైర్హాజరవుతున్న తీరును ఆయన ప్రశ్నించారు.

భవిష్యత్ కాలంలో ప్రతిపక్షాలు, మిత్రపక్షాలు, వామపక్షాలు ఏకమై మతతత్వ పార్టీలను ఓడించడానికి కలిసి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందన్నారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కార్యదర్శి వర్గ సభ్యుడు జబ్బార్, జీఎస్ గోపి, పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్, అమరచింత మండల నాయకుడు వెంకటేష్, రమేష్, అజయ్, అనంతమ్మ, రాఘవేంద్ర, రాజు, వెంకట్రాములు పాల్గొన్నారు.



రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సొంత జిల్లాకు

చేసిందేంటి?



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

- ఢిల్లీకి వెళ్లి రావడం కాదు.. పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేసి వలసలు ఆపండి
- కేసీఆర్ పదేళ్ల పాలన.. ప్రస్తుత రేవంత్ పాలనలో వలసలు ఆగలేదు
- కార్యకర్తలు మూడేళ్లు కష్టపడితే రాష్ట్రంలో అన్ని ఎన్నికల్లో బీజేపీదే విజయం
- కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటిమాటికి ఢిల్లీకి వెళ్లడం తప్ప.. సొంత జిల్లాకు ఏం చేశారో చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక అన్నపూర్ణ గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ పాలమూరు వలసలు ఆగలేదన్నారు. సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే పాలమూరు ప్రాజెక్టులను పూర్తిచేసి, వలసలను ఆపాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల హామీ ఇచ్చిందని, సంవత్సరంన్నర పూర్తయినా ఇప్పటివరకు అవి అమలు చేయలేదన్నారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి,

(మిగతా 6వ పేజీలో..)

మాతృమరణాలు కాకుండా చూడాలి

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో మాతృమరణాలు సంభవించకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గద్వాల జిల్లాలో ఎక్కడా కూడా మాతృమరణాలు జరుగకుండా వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పనిచేయాలన్నారు. లేదంటే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మాతృమరణాలు సంభవించకుండా వైద్యాధికారులు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు సమన్వయంతో గర్భిణులను, బాలింతలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాలని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇచ్చినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. బింగిదొడ్డి గ్రామంలో బాలింతకు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఆర్ఎంపీ వైద్యుడు ఇంటిదగ్గరే ఇంజక్షన్ చేయడం ద్వారా బాలింత మృతి చెందినట్లు, ఆ బాలింత మృతికి కారణమైన ఆర్ఎంపీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యాధికారులు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, హైరిస్క్ లక్షణాలు ఉన్న గర్భిణులను, బాలింతలను ప్రతిరోజు తప్పనిసరిగా గృహ సందర్శన చేసి మాతృమరణాలను అరికట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు డీఎంహెచ్‌వో సిద్ధప్ప, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర, మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి ప్రసూనారాణి, ఇటిక్యాల, గట్టు, పీహెచ్‌సీ వైద్యాధికారి రాధిక, రమేష్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

నాణ్యమైన భోజనం వడ్డించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి విద్యా విభాగం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో, విద్యాలయాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వంట గది, పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. శనివారం ఉదయం వనపర్తి పట్టణంలోని భగీరథ కాలనీలో గల నర్సింగ్ కళాశాల, మర్రికుంట వద్ద గిరిజన సంక్షేమ శాఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. నర్సింగ్ కళాశాల వసతి గృహంలో వంట గది, స్టోర్ రూంను తనిఖీ చేశారు. విద్యార్థుల ద్వారా మెస్ కమిటీ కచ్చితంగా ఉండాలని, రిజిస్టర్ నిర్వహణ జరగాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉంది, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వచ్చే వంట సరకుపై చివరి గడువు తేదీ పరిశీలించాలని, గడువు తీరిన సరకు, నాణ్యత లేని సరకు వస్తే తిరిగి పంపించాలని సూచించారు. అనంతరం మర్రికుంట వద్ద ఉన్న గిరిజన సంక్షేమ శాఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలను తనిఖీ చేశారు. గత సంవత్సరం 11 మంది విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించాలని ప్రిన్సిపాల్ వివరించారు. స్పందించిన కలెక్టర్ వచ్చే సంవత్సరం ఈ కళాశాల నుంచి అత్యధిక సంఖ్యలో ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు సంపాదించే విధంగా బోధన జరగాలని సూచించారు. 9,11వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ కోచింగ్ తరగతులు నిర్వహించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తానని తెలియజేశారు.

పైథాగరస్ సబ్జెక్ట్ బోధించిన కలెక్టర్

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కలెక్టర్ సామర్థ్య పరీక్ష నిర్వహించారు. పైథాగరస్ సబ్జెక్ట్‌లో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కలెక్టర్ వేసిన ప్రశ్నలకు విద్యార్థులు ఐఐటీ ఎన్ఐటీలలో సీట్లు సంపాదించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ముసుగేసిన ముసురు

- వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో 51.2 మి.మీ. వర్షపాతం
- దుందుభీ వాగు దాటుతూ కిందపడి వ్యక్తి మృతి 6

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి 7

రెండు రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలి

- ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, జెన్‌కో సీఎండీ హరీశ్
- శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నాల్గో యూనిట్ పరిశీలన

బ్రహ్మగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన నాల్గవ యూనిట్‌కు నేటికి వినియోగంలోకి రాకపోవడానికి గల కారణాలపై రెండు రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని హెచ్‌పీసీ (హైడల్ ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్) డిపార్ట్‌మెంట్ అధికారులను ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శనివారం జెన్‌కో సీఎండీ హరీశ్, హైడల్ ప్రాజెక్టు డైరెక్టర్ పిల్లి బాలరాజుతో కలిసి ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో పాడైన నాల్గవ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం జెన్‌కో సీఈ కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రంలో జెన్‌కో ఇంజనీర్లు, వాయిత్ కంపెనీ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రమాదం జరిగి ఐదు సంవత్సరాలు అవుతున్నా నాల్గవ యూనిట్ పునరుద్ధరణ చేయక పోవడం అలసత్వం ఏంటనీ ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మండిపడ్డారు. 2023లో మరోసారి యూనిట్‌లో షాట్ సర్క్యూట్ గల కారణాలు, వాయిత్ కంపెనీకి ప్రభుత్వం ఇచ్చిన గడువు ఏప్రిల్ నాటికి పూర్తి కావలసిన పనులు ఎందుకు జాప్యం జరిగిందని జెన్‌కో అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలు యూనిట్ పనిచేయక పోవడం వలన కలిగిన లాభనష్టాలపై పూర్తి నివేదిక సిద్ధం చేయాలని హైడల్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు.

ఆగస్టు చివరివరకు నాల్గవ యూనిట్ మరమ్మతుల పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని వాయిత్ కంపెనీ ఇంజనీర్లను ఆదేశించారు. ఒకటో యూనిట్‌లో డ్రాఫ్ట్ ట్యూబ్‌లో వాటర్ లీకేజీపై ఆరా తీశారు. ఎస్ఈలు ఆదినా రాయణ, రవీంద్రకుమార్, ఇంజనీర్లు పాల్గొన్నారు.



ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో జెన్‌కో ఇంజనీర్లు, వాయిత్ కంపెనీ ఇంజనీర్లతో సమీక్షలో మాట్లాడుతున్న నవీన్ మిట్టల్

శ్రీశైలం బ్రిడ్జి పటిష్టతపై పరిశీలన

» సందర్శించిన నేషనల్ హైవే అధికారులు



శ్రీశైలం బ్రిడ్జిని అడుగు భాగంలో పరిశీలిస్తున్న నేషనల్ హైవే అధికారులు

బ్రహ్మగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర- తెలంగాణ సరిహద్దులో 60 సంవత్సరాల క్రితం నిర్మించిన శ్రీశైలం బ్రిడ్జిని నేషనల్ హైవే, ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ అధికారులు శనివారం పరిశీలించారు. పురాతనమైనది కావడంతో బ్రిడ్జిపై పెద్దపెద్ద వాహనాల రాకపోకల సందర్భంగా కదలికలు వస్తుండడంతో బ్రిడ్జిపై కొంత ప్రమాదకర పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో బ్రిడ్జి కూలి ప్రమాదం సంభవించింది. యాభై సంవత్సరాల క్రితం నిర్మించిన భారీ వంతెనల స్థితిగతులపై పరిశీలించిన నివేదిక ఇవ్వాలన్న ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అధికారులు శ్రీశైలం బ్రిడ్జిని పరిశీలించినట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో ఆదరించే పార్టీలకు మా అండ

» సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సగరులకు ు ప్రాధాన్యత ఇచ్చి ఆదరించే పార్టీలకు అండగా ఉంటామని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో సగర సంఘం రాజకీయ చైతన్య సదస్సు సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సగరులు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా పెద్ద మొత్తంలో పోటీ చేయాలని, సహకరించని పార్టీలను ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉన్నా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లం రాముడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొల్ల బాబుసాగర్, రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, అతినారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి టి.సాగర్ ముఖ్య అతిథిగా హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై ఉద్యమ కార్యచరణపై దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షాలు అడిగే ఏ ఒక్క ప్రశ్నకు కూడా కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని, ప్రశ్నించిన వారికి హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తోందని ఆరోపించారు. ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, కె.గీత, సి.ఆంజనేయులు, బి.ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, మల్లయ్య, పరశురాములు, శ్రీనివాస్, శంకర్‌నాయక్, శివవర్మ, రామయ్య, నాగరాజు, అశోక్, తారాసింగ్ పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

అడ్డుకట్ట వేయవచ్చు. ఇప్పుడిప్పుడే లంచం అడిగితే ఏసీబీని ఆశ్రయించాలనే చైతన్యం పెరుగుతుండగా అది ప్రశ్నించేతత్వం అలవాటు దిశగా పయనించాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి జిల్లాకు ఒక డీఎస్పీతో ఏసీబీ పని చేస్తుండగా ఇంకా సిబ్బందిని పెంచి జిల్లాలవారీగా విస్తరించడం వల్ల కూడా అధికారుల్లో భయం నెలకొనే అవకాశం ఉంటుంది. అలాగే కాలనీలు, వార్డుల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించడం, ఏసీబీని ఆశ్రయించడంపై ఎక్కువ ప్రచారం కల్పించడం, కళాజాత బృందాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. అయితే కేవలం అవినీతి అధికారులపై ఫిర్యాదులు వస్తే వారిని ఏసీబీ పట్టుకోడమే కాకుండా ఆకస్మిక తనిఖీలు చేస్తోంది. ఆ తనిఖీలు మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. ఎప్పుడు ఎక్కడ తనిఖీలు చేస్తారో అనే భయం ఉండటం వల్ల అటు లంచం తీసుకునేవారికి, ఇటు మధ్యవర్తులకు భయం ఏర్పడుతుంది. పోలీసు, రెవెన్యూ శాఖలకు సంబంధించి మధ్యవర్తులపై ఎక్కువ దృష్టి సారించాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతోంది. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా అచ్చంపేట బీసీ వెల్ఫేర్ హాస్టల్, జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, మహబూబ్‌నగర్ ఆర్టీఏ ఆఫీసు, కోయిల్‌కొండ బీసీ వెల్ఫేర్ హాస్టల్, జల్లాపూర్ ఆర్టీఏ చెక్‌పోస్టును ఇప్పటివరకు ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు.

నమోదైన కేసులు ఇలా...

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 2024 జనవరి నుంచి ఇప్పటివరకు 18 ఏసీబీ కేసులు నమోదయ్యాయి. గతేడాది 14 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 4 కేసులు నమోదయ్యాయి. బాధితులు ఫోన్ చేస్తే చాలు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. ఇందులో ఎక్కువ మంది జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు. ఆ కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

ఉలికిపాటు!



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహబూబ్‌నగర్ డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ దిన్నె వెంకటేశ్వర్‌రెడ్డి (ఫైల్)

- 2024 జనవరి 20న కల్వకుర్తి ఆర్డీఓ ఆఫీసులోని సర్వే విభాగంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రమావత్ వాస్య పంచనామా కాపీ ఇవ్వడానికి రూ. 8 వేలు లంచం అడిగి పట్టుబడ్డాడు.
- 2024 జనవరి 22న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా జడ్చర్లలో పనిచేస్తున్న రత్నావత్ బాలోజీ టీఎఫ్‌టీ లైసెన్స్ కోసం రూ. 65 వేలు డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కాడు.
- 2024 జనవరి 29న అయిజలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న జీవరత్నం విద్యుత్ స్తంభాన్ని ఓ ప్లాటులో తొలగించడానికి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.
- 2024 ఫిబ్రవరి 4న మహ్మదాబాద్ ఎస్ఐ దుప్పల్లి సురేష్ రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- 2024 ఫిబ్రవరి 10న మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో ఏఈగా పనిచేస్తున్న పృథ్వీ రూ. 50 వేలు లంచం డిమాండ్ చేయగా పట్టుకున్నారు.
- 2024 మార్చి 27న గుండుమాల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పాండునాయక్, ధరణి ఆపరేటర్ రవీందర్‌రెడ్డి, రికార్డు అసిస్టెంట్ చిన్నమొగులప్ప రూ. 2 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- 2024 మే 5న వనపర్తి టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ నాగేంద్రకుమార్, డీఈ నరేంద్రకుమార్, అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ మధుకర్ రూ. 19 వేలు డిమాండ్ చేసి పట్టుబడ్డారు.
- 2024 జూన్ 12న బీచుపల్లి బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నర్సింహమూర్తి రూ. 50 వేలు లంచం తీసుకుండగా ఏసీబీ పట్టుకున్నది.
- 2024 జూన్ 25న వెల్దండ ఎస్ఐగా పనిచేసిన రవి రూ. 50 వేలు డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కారు.
- 2024 జూలై 25న మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ సర్వేయర్‌గా పనిచేస్తున్న గవినోళ్ల బాలరాజు రూ. 9 వేలు లంచం డిమాండ్ చేసి పట్టుబడ్డారు.
- 2024 సెప్టెంబర్ 3న మహబూబ్‌నగర్ డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి రూ. 10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- 2024 అక్టోబర్ 22న పెబ్బేరు మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఆదిశేషు రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పట్టుకున్నది.
- 2024 నవంబర్ 7న మహబూబ్‌నగర్ డీఈఓగా పనిచేస్తున్న ఏ. రవీందర్‌ను రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.
- 2024 నవంబర్ 18న ఇటిక్యాల మండలంలో పంచాయతీరాజ్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మదీక్షిత్ పాండురంగ రూ. 50 వేలు లంచం అడిగి పట్టుబడ్డారు.
- 2025 ఫిబ్రవరి 2న గద్వాల డీపీఓగా పనిచేస్తున్న బోగం శ్యామ్‌సుందర్, పుల్లూరు పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ. 2 లక్షలు లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కారు.
- 2025 ఫిబ్రవరి 18న మక్తల్ సీఐగా పనిచేసిన చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు సింగసాని శివ, నర్సింహులు రూ. 20 వేలు లంచం డిమాండ్ చేయగా అధికారులు పట్టుకున్నారు.
- 2025 ఏప్రిల్ 23న ఘన్‌పూర్ సెక్షన్‌లో విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న కొండయ్య రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు.
- 2025 జూన్ 25న కల్వకుర్తిలో ఎస్ఐ-2గా ఉన్న రాంచందర్‌జీ రూ. 10వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు.

వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా పని చేయాలి

» డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

» రెస్క్యూ బృందాలకు తుపాకీ మత్తుమందు బుల్లెట్లపై ముగిసిన శిక్షణ



రెస్క్యూ బృందం సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు , జూట్ బ్యాగులను అందజేస్తున్న డీఎఫ్ఓ రోహిత్ గోపిడి

మన్ననూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా రెస్క్యూ బృందాలు పని చేయాలని ఏటీఆర్ డీఎఫ్‌వో రోహిత్ గోపిడి అన్నారు. రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల్లోని అభయారణ్యాల్లో పనిచేసే 45 మంది రెస్క్యూ ఆపరేషన్ బృందాలకు అమ్రాబాద్ పులుల అభయారణ్య పరిధిలోని మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో రెండో రోజు తుపాకీ మత్తు మందు బుల్లెట్ల వాడకం, గాయాలపాలైన, అనారోగ్యంతో అస్వస్థతకు గురైన అడవి జంతువులకు ప్రాథమిక వైద్యం అందించే విధానంపై మహారాష్ట్రకు చెందిన రెస్క్యూ ఆపరేషన్ శిక్షణాధికారులు నాచికేత్ ఉత్పత్, కిరణ్ రహాల్కర్‌లు సూచనలిచ్చారు. శనివారం సాయంత్రం డీఎఫ్ఓ రోహిత్ గోపిడి రెండు రోజుల శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలకు ధ్రువీకరణ పత్రాలు, ఏటీఆర్ జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు. పెద్దపులి, చిరుత పులి తదితర వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చినట్లు సమాచారం వస్తే రెస్క్యూ బృందాలు వాటిని అడవిలోకి సురక్షితంగా తీసుకెళ్లేలా జాగ్రత్తలు వహించాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీకాంత్, బీట్ అధికారులు మధుసూదన్, ఆనంద్ పాల్గొన్నారు.

నిరంతరాయంగా కొనసాగుతున్న జలవిద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పతి కొనసాగుతుందని ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ శనివారం తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్లను ప్రారంభించి 3.724 మిలియన్ యూనిట్లను రాబట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 161.595 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో 4.349 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు చెప్పారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 191.555 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు చెప్పారు. వరద ఆశించిన మేర వస్తున్న కారణంగా, ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో అన్ని యూనిట్లను ప్రారంభించిన ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇలాగే కొనసాగితే త్వరలోనే నిర్దేశించిన మిలియన్ యూనిట్లను చేరుకునే అవకాశం ఉందన్నారు.

కురుమూర్తి ఆలయ హుండీ లెక్కింపు



ప్రాంగణంలో హుండీ లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

చిన్నచింతకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం స్వామి వారి హుండీ లెక్కించారు. ఇందులో రూ. 7,56,493 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, భాస్కరాచారి, శేఖర్, భారతమ్మ, నాగరాజు, వెంకటేశ్వర్లు, రాములు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాసం పూజలు

» నరసింహస్వామికి అమ్మవారికి వెండి ముఖం అందజేసిన దాతలు



లక్ష్మీనరసింహస్వామి, అమ్మవారి వెండిముఖం ఆభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాతలు

తిమ్మాజిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో తొలి శనివారం సందర్భంగా మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయం భువుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామిని అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తిమ్మాజిపేట నివాసం జోషి వేదం వెంకటేశ్వరశర్మ జ్ఞాపకార్థమై ఆయన భార్య సులోచన విలువైన వెండి ముఖాన్ని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన శ్రీనివాస గంగాధర్ జోత్స్న దంపతులు అమ్మవారికి రూ.10,500 విలువైన వెండి ముఖాన్ని తయారు చేయించి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వేద పండితులు గంగాధర శర్మ లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లకు వెండి ముఖాలను ప్రత్యేక అలంకరణతో చేసి అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామావళి పఠించి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుక సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ, ఆలయ కమిటీ సభ్యులు చిలుక రామచంద్రారెడ్డి, రమేష్, చిలుక ఎల్లారెడ్డి, లక్ష్మణరావు, మైపాల్‌రెడ్డి, పర్వతాలు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి అభిషేకాలు



నంది వడ్డెమాన్‌లోని శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామంలోని సార్ధ సప్త జేష్టాదేవి సమేత శనీశ్వర స్వామికి శనివారం శ్రావణ విదియ పురస్కరించుకొని భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ జన్మ, గోచార రీత్యా గ్రహ దోషాలు ఉన్న వారు ఏలినాటి శని, అర్ధాష్టమ శని, అష్టమ శనిగ్రహ బాధలు తొలగేందుకు శనీశ్వర స్వామికి తిల తైల అభిషేకాలు, బ్రహ్మసూత్రం ఉన్న పరమ శివుడికి రుద్రాభిషేకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, ఆలయ సహాయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, గవ్వమఠం ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి ఉన్నారు.

సొంత జిల్లాకు చేసిందేంటి?

(5వ పేజీ తరువాయి)

నల్గొండ జిల్లాలకు నీరిచ్చే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కప్పిపుచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. అందులో 10 శాతం ముస్లింలకే కేటాయించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీసీ కమిషన్ తెచ్చింది బీజేపీ అని, బీసీలకు న్యాయం చేసింది కూడా బీజేపీయే అన్నారు. గురుకులాల్లో బీసీ విద్యార్థులు ఇబ్బందులు పడి, అనారోగ్యాల పాలవుతుంటే, ఉండలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే సీఎం ఎందుకు స్పందించడం లేదన్నారు. పాలమూరు యూనివర్సిటీకి నిధులు రాక, విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే డీకే అరుణ కృషితో రూ.100 కోట్లు వచ్చాయని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీకి అడ్డా అని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు జిల్లా పరిషత్‌లపై పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్పొరేషన్, మునిసిపాలిటీలు, పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కోరారు. మూడేళ్లు కష్టపడితే అన్ని ఎన్నికల్లో బీజేపీదే గెలుపన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది పాలమూరు జిల్లా అని, తనను ఎమ్మెల్సీగా ఇక్కడి ప్రజలు గెలిపించారని అన్నారు.

గ్యారెంటీల పేరుతో మోసం: డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసిందని, ఇప్పటివరకు వాటి అమలును పట్టించుకోవడం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తి చేయలేదని, ఇందిరమ్మ ఇళ్లు పేదలకు ఇవ్వకుండా కార్యకర్తలకు ఇస్తోందని అన్నారు. వాటిపై గ్రామాల్లో కార్యకర్తలు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు- రంగారెడ్డిని ప్రస్తుత ప్రభుత్వం పాత డిజైన్ ప్రకారం చేపట్టి, పూర్తి చేయకపోతే బీజేపీ శ్రేణులను ముందుండి నడిపించి ఉద్యమం చేస్తానని హెచ్చరించారు. మోదీ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు అరుణమ్మ పాలమూరుకు ఏం తెచ్చిందని అంటుంటారని, ఇప్పుడు జరిగిన, జరుగుతున్న అభివృద్ధి ఎవరు తెచ్చిన నిధులతో జరుగుతుందో గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా.. వారి గెలుపు కోసం పనిచేయాలన్నారు. నాయకులు డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి, వీరబ్రహ్మచారి మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నిల ల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలు తహతహలడుతున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు పద్మజారెడ్డి, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్, సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కట్ట సుధాకర్‌రెడ్డి, పడాకుల బాలరాజ్, ఎగ్గని నర్సింహులు, వీరబ్రహ్మచారి, పాండురంగారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్ తదిరతులు పాల్గొన్నారు

శాంతకుమార్ గో బ్యాక్



తోపులాడుకుంటున్న డీకే అరుణ, శాంతకుమార్ వర్గీయులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటనలో భాగంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశం వివాదానికి దారి తీసింది. పార్లమెంట్ ఎన్నికల సమయం నుంచి నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. కార్యక్రమం ప్రారంభమైన తర్వాత అక్కడకు వచ్చిన పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్‌ను వేదికపైకి ఆహ్వానించగా.. యువమోర్చా నాయకులు, డీకే అరుణ వర్గం నాయకులు ఒక్కసారిగా శాంతకుమార్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓటమి కోసం పని చేశారని, ఆయన్ను ఘెరావ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి శాంతకుమార్, డీకే అరుణ టికెట్ ఆశించిన విషయం తెలిసిందే. పార్టీ డీకే అరుణకు టికెట్‌ను కేటాయించింది. ఆ సమయంలో అరుణను ఓడించాలని శాంతికుమార్ పనిచేసినట్లు ఆమె వర్గం నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తాజా గొడవకు దారి తీసింది. డీకే అరుణ స్పందిస్తూ.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో తనను ఓడగొట్టేందుకు పార్టీ నాయకులను ఇతర పార్టీలో చేర్పించిన వారు.. ఈ సమావేశానికి ఎందుకు వచ్చారని మండిపడ్డారు. జై శ్రీరాం అని అనేవారు.. అదే శ్రీరాముడి మీద ఒట్టు వేసి తన గెలుపు కోసం పని చేశామని చెబుతారా? అని పరోక్షంగా శాంతకుమార్‌ను ఉద్దేశించి అన్నారు. దీంతో యువమోర్చా నాయకులు పెద్ద ఎత్తున శాంతకుమార్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అలాగే తాను ఏ పార్టీలో ఉన్న క్రమశిక్షణ పాటిస్తానని, క్రమశిక్షణ లేనివారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడిని ఆమె కోరారు.

ముసుగేసిన ముసురు

» వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో 51.2 మి.మీ. వర్షపాతం

» దుందుభీ వాగు దాటుతూ కింద పడి వ్యక్తి మృతి



జంగయ్య(ఫైల్)

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి/కల్వకుర్తి/తెలకపల్లి/గద్వాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పది రోజులుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో క్రమం తప్పకుండా కురుస్తున్న వానలకు జనజీవనం స్తంభించిపోతోంది. ఒక రోజు భారీ వర్షాలు కురిస్తే మరో రోజు ముసురువానలు కురుస్తున్నాయి. శనివారం తెల్లవారుజాము నుంచే ముసురు ప్రారంభమైంది. సాయంత్రం వరకు మేఘాలు కమ్ముకొని ఉన్నాయి. వ్యవసాయ పనులకు ముసురు వానలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే పత్తి, మొక్కజొన్న పంటలకు కలుపు బెడద పెరిగిపోతోంది. నల్లరేగడి పొలాల్లో పత్తి సాగు చేసిన రైతులకు రోజూ కురుస్తున్న వానలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలానే కురిస్తే కలుపు పెరిగి పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదు. అలానే తెగుళ్ల బారిన పడే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల పాటు ఎండలు కాస్తే పొలం ఆరి గుంటుకలు కొట్టి, కలుపు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

వనపర్తి జిల్లాలో అధికం

- వనపర్తి జిల్లా గోపాల్ పేటలో శనివారం 51.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.
- నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 41.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కోస్గి మండలంలో 28.3 మి.మీ, ఊట్కూర్ 21.5, ధన్వాడ 21.3, దామరగిద్ద, కృష్ణ మండలాలలో 19.0, కొత్తపల్లి మండలంలో 18.5, నర్వ మండలంలో 18.5, నారాయణపేట 17.3, మాగనూర్ మండలంలో 14.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.
- నాగర్‌కర్నూల్ టౌన్ జిల్లా లింగాల మండలంలో 36.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అచ్చంపేటలో 34.8, కల్వకుర్తిలో 31.4, అమ్రాబాదులో 29.2, పెద్దకొత్తపల్లిలో 28.2, కోడేరులో 25.2, తెల్కపల్లిలో 21.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.
- మహబూబ్‌నగర్ జిల్లాలోని కౌకుంట్లలో 23.2 మి.మీ., నవాబ్‌పేటలో 22.6 మి.మీ., బాలానగర్‌లో 21.8, జడ్చర్లలో 20.8, గండీడ్‌లో 20.7, మహ్మదాబాద్‌లో 19.6, దేవరకద్రలో 19.4, సీసీకుంటలో 18.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.
- జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డిలో 12.3 మిల్లీమీటర్లు, ధరూర్‌లో 14.5, గద్వాలలో 13.3, మల్దకల్‌లో 4.1, గట్టులో 3.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఆలంపూర్ నియోజకవర్గంలో వర్షం కురవ లేదు.
- తెలకపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన ఎస్.జంగయ్య (60) వంగూరు మండలం పోతారెడ్డిపల్లి గ్రామంలో ఉన్న తన కూతురు వద్దకు శనివారం బయల్దేరాడు. రామగిరి-రఘుపతిపేట మధ్య దుందుభీ నది నీరు ప్రవహిస్తుండగా నీటిలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి నీటిలో మునిగి మృతి చెందాడు. గమనించిన యువకులు వెంటనే అప్రమత్తమై జంగయ్యను నీటిలో నుంచి బయటకు తీశారు. అప్పటికే ఆయన మృత్యువాత పడ్డాడు.

వాగును దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

కల్వకుర్తి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు వాగులు దాటేట ప్పుడు అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే వాగుల వద్దకు వెళ్లవద్దని కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం కోరారు. కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతిపేట దుందుభీ నది వాగును శనివారం ఆయన స్థానిక అధికారులు, పోలీస్ సిబ్బందితో కలి సి పరిశీలించారు. వాగులోని సీసీ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించి గుంతలను పూడిపించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. తెలకపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన జంగయ్య వాగులో జారి పడి మృతి చెందడం బాధాకరమని, ఇలాంటి సంఘటన లు పునరావృతం కాకుండా ప్రజలు ప్రవహిస్తున్న వాగులను దాట రాదని సూచించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి : మరొకరికి గాయాలు


సోహెల్ (ఫైల్)

కొత్తకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనిమెట్ట గ్రామ శివారు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా... మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోటకు చెందిన సోహెల్ గ్లాస్ ఫిట్టింగ్ పని చేస్తాడు. వ్యాపార నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా, భూతూర్ మండలం, అన్నసాగర్‌లో వర్క్ ఆర్డర్ నిమిత్తం బైక్‌పై వెళ్లాడు. తిరిగి సొంత గ్రామానికి వస్తూ... అడ్డాకల మండలం పెద్ద మునగల్ చేడ్ గ్రామానికి చెందిన మిత్రుడు తయ్యబ్‌ను బైక్ ఎక్కించుకొని తిరుగుప్రయాణమయ్యాడు. కనిమెట్ట గ్రామ శివారులో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొటింది. దీంతో గాయాలైన ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. సోహెల్(28) చికిత్స పొందుతూ మృతి చెందగా.. తయ్యబ్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని శనివారం బంధువులకు అప్పగించినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతుడు తోక సురేష్ (ఫైల్)

పెబ్బేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీలోని 4వ వార్డుకు చెందిన తోక సురేష్(45) విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ గంగిరెడ్డి యుగేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన ఇంటి ఆవరణలో కొళాయి వద్ద ఉన్న విద్యుత్తు మోటార్‌కు కనెక్షన్ ఇచ్చి తన కొత్త ఇంటి గోడల నిర్మాణాలకు నీటిని పట్టాడు. అనంతరం విద్యుత్తు మోటార్‌ను బంద్ చేసే క్రమంలో విద్యుత్తు వైర్లు చేతికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉమా, కుమారులు గౌతమ్, వరుణ్ ఉన్నారు. పెద్దదిక్కు కోల్పోవడంతో ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫిట్స్ వచ్చి నారుమడిలో పడి రైతు మృతి

శ్రీరంగాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఫి ట్స్ వచ్చి నారు మడి లో పడి రైతు అక్కడి కక్కడే మృతిచెందిన సంఘటన శ్రీరంగాపూ ర్ మండల పరిధిలోని తాటిపాముల గ్రామం లో చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వి వరాలు ఇలా ఉన్నా యి. తాటిపాములకి చెందిన గౌనికాడి బాలస్వామి(47) తన సొంత పొలంలో తుకం చల్లాడు. శనివారం నారుమడి చూడటానికి వెళ్లాడు. అదే సమయంలో అనుకోకుండా ఫిట్స్ వచ్చి తుకంలో పడటంతో ఊపిరి ఆడక మృతిచెందాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి మృతుడి కుటుం బ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


నరసింహ (ఫైల్)

రేవల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేశంపేటలో అదృశ్యమైన నరసింహ మృతదేహం తాను చేస్తున్న కౌలు పొలంలో శనివారం కనిపించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేటకు చెందిన నరసింహ గురువారం ఉదయం పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాలేదు. చుట్టు పక్కల బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ కనబడకపోవడంతో కుమారుడు కుర్మయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నరసింహ తాను కౌలుకు చేస్తున్న పొలంలో అతని మృతదేహం శనివారం కనిపించింది. గతంలో అతనికి ఫిట్స్ వచ్చేదని కుటుంబ సభ్యులు తెలిపినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తేజేశ్వర్‌ను హత్యచేసింది ఈ కారులోనేనా?

» కారును చూపి విలపించిన మేనత్త, అన్న


సర్వేయర్ తేజేశ్వర్‌ను హత్య చేసిన కారును పరిశీలిస్తున్న మేనత్త, అన్న

గద్వాల క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తన మేనల్లుడు అయిన సర్వేయర్ తేజేశ్వర్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసింది ఈ కారులోనేనా అంటూ కారును చూసి మేనత్త రాణమ్మ, తేజేశ్వర్ అన్న తేజవర్ధన్ బోరున ఏడ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐ కార్యాలయానికి వచ్చిన వారు ఆవరణలో నిలిపిఉన్న కారు దగ్గరికి వెళ్లి పరిశీలనగా చూశారు. గురువారం తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న తిరమల్‌రావుతో పాటు తేజేశ్వర్ భార్య ఐశ్వర్యను పోలీసులు మూడురోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో, హత్యకు సంబంధించి ఏమైనా వివరాలను వెల్లడించారా అనే విషయాలను తెలుసుకునేందుకు వీరు అక్కడికి వచ్చారు.

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

» తలపడిన 17 మహిళా జట్లు, 18 పురుషుల జట్లు


బాలు కోసం ఆరాటపడుతున్న రంగారెడ్డి, కమ్మం బాలుర జట్టు క్రీడాకారులు

అయిజ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర బాస్కెట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. అయిజ మాజీ ఎంపీపీ దివంగత తిర్మల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఈ పోటీలను జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉత్తనూర్‌లో కుటుంబ సభ్యులు గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తెలంగాణ రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్‌తో కలిసి నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. శనివారం లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి.

బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు కరీంనగర్‌పై 26 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందింది. సూర్యాపేట జట్టు జగిత్యాల జట్టుపై 13పాయింట్లు, హనుమకొండ జట్టు వరంగల్ జట్టుపై 18 పాయింట్లు, మేడ్చల్ జట్టు మహబూబాబాద్ జట్టుపై 22 పాయింట్లు, హైదరాబాద్ జట్టు ఖమ్మం జట్టుపై 12 పాయింట్లు, వికారాబాద్ జట్టు జగిత్యాల జట్టుపై 36 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందాయి.

బాలుర విభాగంలో కరీంనగర్ జట్టు ములుగు జట్టుపై 38 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందింది. నిజామాబాద్ జట్టు కామారెడ్డిపై 8 పాయింట్లు, సూర్యాపేట జట్టు జయశంకర్ జిల్లా జట్టుపై 41 పాయింట్లు, రంగారెడ్డి జట్టు ఖమ్మం జట్టుపై 28 పాయింట్లు, మేడ్చల్ జట్టు కామారెడ్డి జట్టుపై 32 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందాయి. ఆదివారం సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన రెఫరీలు మధు, మహేష్, ప్రశాంత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు.

రాణిపేట టు థాయిలాండ్

» సాఫ్ట్‌బాల్‌లో కిరణ్‌కుమార్ మెరుపులు
» ఏషియా కప్-2025 భారత జట్టుకు ప్రాతినిధ్యం
» 25 రాష్ట్రస్థాయి, 9 జాతీయస్థాయి టోర్నీల్లో ప్రతిభ


ఏషియా కప్‌లో పాల్గొన్న భారత జట్టులో కిరణ్‌కుమార్ (వృత్తంలో)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువకులు క్రీడల్లో సత్తాచాటుతున్నారు. క్రీడా మైదానాల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధుల సహకరంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్ మండలం రాణిపేట గ్రామానికి చెందిన జక్కా కిరణ్‌కుమార్ సాఫ్ట్‌బాల్ క్రీడలో అసమాన ప్రతిభ కనబరుస్తున్నాడు. గత నెల 2 నుంచి 5వ తేదీ వరకు థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన 2వ అండర్-23 పురుషుల సాఫ్ట్‌బాల్ ఏషియా కప్-2025లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తండ్రి ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ మహబూబ్‌నగర్‌లో చదివించారు. పాఠశాలలో చదువుతున్న సమయంలో పీఈటీ నాగేంద్ర ప్రోత్సాహంతో క్రీడల్లో రాణించాడు. కోచ్‌లు సాదిక్‌అలీ, రాఘవేందర్, నాగరాజు వద్ద సాఫ్ట్‌బాల్ క్రీడలో ఓనమాలు నేర్చుకున్నాడు. రాష్ట్రస్థాయి టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరిచి ఉత్తమ బ్యాటర్‌గా ఎదిగాడు.

రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలో..

కిరణ్‌కుమార్ 25 రాష్ట్రస్థాయి టోర్నీలు ఆడాడు. 2016లో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్‌లో జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మొదటి సారిగా పాల్గొన్నాడు. 2017లో హైదరాబాద్, ఛత్తీస్‌ఘడ్, 2018లో జూనియర్ నేషనల్‌లో ఆడాడు. 2022లో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో జరిగిన సీనియర్ నేషనల్, అదే ఏడాది గుంటూరులో జరిగిన సౌత్‌జోన్ సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2023-24లో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన సీనియర్ నేషనల్, తమిళనాడు సేలంలో జరిగిన ఆలిండియా ఇంటర్‌జోనల్ నేషనల్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో రాష్ట్రం తరుఫున ఆడి జట్టు విజేతగా నిలవడంతో పాటు బంగారు పతకం సాధించాడు. ఈ ఏడాది జనవరి 18, 19న మహారాష్ట్రలోని జలగోన్‌లో నిర్వహించిన భారత సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. 20మందిని ఎంపిక చేసి మధ్యప్రదేశ్‌లో ఫైనల్ ట్రయల్స్ నిర్వహించారు. తెలంగాణ నుంచి ఇద్దరు ఉన్నారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కిరణ్‌కుమార్ చోటు దక్కించుకొని మొదటి సారి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ అండ్ కామర్స్ కళాశాలలో ఎంఎస్‌జీ కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ చదుతున్నాడు.

ఒలింపిక్స్‌లో ఆడడమే లక్ష్యం



కోచ్‌ల ప్రోత్సాహంతోనే సాఫ్ట్‌బాల్‌లో ఈ స్థాయికి ఎదిగాను. సాఫ్ట్‌బాల్ ఏషియా కప్‌లో భారత జట్టులో చోటు దక్కడం నా అదృష్టం. మొదటి సారి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. 2027లో ఒలింపిక్స్‌లో సాఫ్ట్‌బాల్ క్రీడకు చోటు దక్కింది. ఈ ఒలింపిక్స్‌లో భారత జట్టుకు ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రభుత్వం ఉద్యోగం సాధించాలన్నదే నా కల.

- జక్కా కిరణ్‌కుమార్, సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు

రోడ్డు ప్రమాదంలో జాతీయ పక్షి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జాతీయ పక్షి నెమలి

చారకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని జాతీయపక్షి నెమలి మృతిచెందింది. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బీట్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... జూపల్లి సమీపంలోని జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం జాతీయ పక్షి నెమలికి తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది.

ఎస్‌ఐ శంషుద్దీన్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతి చెందిన నెమలిని పరిశీలించి స్వాధీనం చేసుకొన్నారు. దానిని మండలంలోని కమాల్‌పూర్ సమీపంలో ఉన్న అడవిలో పూడ్చిపెట్టినట్లు బీట్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆమె వెంట వాచర్లు లస్కర్, చంద్రు, తదితరులు ఉన్నారు.

పోలీసులు బాధ్యతగా పని చేయాలి


గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో డీఐజీ

» గద్వాలలో పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన డీఐజీ చౌహాన్

గద్వాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పోలీసులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు చేరువ కావాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సూచించారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అలంపూర్ సర్కిల్ కార్యాలయంతో పాటు గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీనివారావుతో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్ ఇన్ఫర్మేషన్ బుక్, క్రైం, ప్రాపర్టీ, పిటిషన్ రిజిస్టర్, రిసెప్షన్, జనరల్ డైరీ, సెంట్రీ రిలీఫ్ బుక్, బీట్ డ్యూటీ రిజిస్టర్, సస్పెక్ట్ చెక్, విజిటింగ్ రిజిస్టర్, ఫైనల్ రిపోర్ట్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. తరచూ పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేయాలని అలంపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవిబాబుకు సూచించారు. బ్లూకోల్ట్స్ పెట్రోకార్ నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలని సూచించారు. సిబ్బంది బాధ్యతగా పనిచేసే విధంగా చూడాలని రూరల్ ఎస్సై శ్రీకాంత్‌కు సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ ఎవరి పరిధిలో వారు నిత్యం అమలు చేయాలని, సిబ్బందికి సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని చెప్పారు. రౌడీ షీటర్స్ పాతనేరస్తులపై నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం ఆయన గద్వాల ఎస్పీ కార్యాలయానికి చేరుకొని గౌరవ వేతనం స్వీకరించారు. 5బీ, డీసీఆర్‌బీ రికార్డులను, ఏ, బీ సెక్షన్ రికార్డులను హెడ్‌క్వార్టర్‌కు సంబంధించిన ప్లాటూన్ రికార్డును, అడ్మిన్ స్టోర్ రికార్డు, బెల్ ఆఫ్ ఆర్మ్స్ రికార్డులను, డాగ్ స్క్వాడ్స్ రికార్డులను తనిఖీ చేశారు. వివిధ విభాగాల పని తీరును ఎస్పీ వివరించారు. జిల్లాలో శాంతి భద్రతలపై ఎస్పీ తీసుకుంటున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం తెలంగాణ వనమహోత్సవంలో పాల్గొని అలంపూర్, గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్, ఎస్పీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, ఏవో సతీశ్‌కుమార్, సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, గద్వాల, శాంతినగర్ సీఐ టంగుటూరి శ్రీను, టాటాబాబు ఎస్సైలు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

అలంపూర్ : స్థానిక జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్ శనివారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిశీలించి క్రైం రికార్డులు, ప్రభుత్వ ప్రాపర్టీ రికార్డులు, పిటిషనర్ రిజిస్టర్లను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్‌హెచ్‌వో, మెన్ రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్‌ను పరిశీలించారు.

30న ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-11 బాల, బాలికల విభాగాల్లో ఎంపికలు ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, ఎల్. రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఇండోర్ స్టేడియం సంబంధిత పత్రాలతో రిపోర్టు చేయాలని కోరారు.

నిబంధనలకు లోబడి వైద్యం అందించాలి

» కాటేపాగ రాజు మృతిపై విచారణ అధికారిని నియమించాం
» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అల్లె శ్రీనివాసులు
» పెబ్బేరులో శ్రీరాఘవేంద్ర ఆసుపత్రిలో విచారణ చేపట్టిన అధికారులు


వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

పెబ్బేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు లోబడి వైద్యం అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అల్లె శ్రీనివాసులు హెచ్చరించారు. మెడపై ఉన్న కణతిని తొలగించడంతోనే మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన కాటేపాగ రాజు మృతి చెందాడని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ.. శుక్రవారం ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. శనివారం ఆరోపనలు ఎదుర్కొంటున్న శ్రీరాఘవేంద్ర ఆసుపత్రిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల బృందం విచారణ చేపట్టారు. మృతుడు 19న ఆసుపత్రికి వచ్చిన రికార్డులు, వైద్య బిల్లులను పరిశీలించి మృతుడికి అందించిన వైద్యం తీరుపై వైద్యుడు రాఘవేందర్ రెడ్డితో పాటు ఆపసుపత్రి సిబ్బందిని విచారించారు. మెడపై చిన్నపాటి గుల్లలో ఉన్న చీమును తీసి డ్రసింగ్ చేసి మాత్రలు ఇచ్చాం, మరుసటి రోజున మృతుడు డ్రస్సింగ్ చేయించుకున్నాడని విచారణలో తేలిందన్నారు. కాటేపాగ రాజు మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.శ్రీనివాసులును నియమించినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులతో పూర్తి విచారణ చేసిన తరువాత నివేదికను కలెక్టర్ ఆదర్శ్ సురభికి అందజేయనున్నట్లు తెలిపారు. విచారణలో మృతుడికి కణతి సర్జరీ చేసినట్లు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మృతుడు డ్రసింగ్ కోసం ఆసుపత్రికి వచ్చిన రోజు సీసీ ఫుటేజ్‌లో రికార్డు ఉందన్నారు. 19న మృతుడికి కణతి వైద్యం చేసిన సీసీ ఫుటేజ్‌లో రికార్డు లేకపోవడంతో మృతుడి కుటుంబ సభ్యులు చేసిన ఆరోపనలకు బలం చేకూరుతుందన్నారు. సంబంధిత అధికారులు మాత్రం 19న మృతుడు వచ్చి కణతి వైద్యం చేయించుకున్న సీసీ ఫుటేజ్ కచ్చితంగా తీసుకొని ఇవ్వాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి


విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

» మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు/ అమరచింత, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో అత్యధిక స్థానాలు గెలుపొంది బీఆర్ఎస్ సత్తా చాటాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అమరచింత మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి మస్తీపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేశారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అందిస్తామని, ప్రజలను ముంచే పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రైతు రుణమాఫీ, బోనస్, రైతుబంధు అమలు చేస్తామని ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారం చేపట్టి ఒక్క మహిళలకు ఫ్రీ బస్సు మాత్రమే అమలు చేసి వారిలో వారిని కొట్టుకునేలా చేసిన పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజల్లోకి తీసుకువెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది సత్తా చాటాలని ఆదేశించారు.

కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తే సహించం

అధికారంలో ఉన్నాం కదా అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి భయాందోళనలకు గురి చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. ఉద్యమ సమయంలో ఎన్ని కేసులు పెట్టిన భయపడకుండా ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ అని గుర్తు తెచ్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజేందర్ సింగ్ రమేష్ ముదిరాజ్, రవికుమార్ యాదవ్, మంగమ్మ, ఎస్ఎ రాజు, నాగభూషణం గౌడ్, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ బదిలీలు చేపట్టాలి

» జెన్‌కో సీఎండీ హరీశ్‌కు జెన్‌కో ఇంజనీర్ల వినతి


జెన్‌కో సీఎండీ హరీశ్‌ను సన్మానిస్తున్న ఇంజనీర్ల సంఘం సభ్యులు

బ్రహ్మగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా జెన్‌కో సంస్థలో సాధారణ బదిలీలు జరగడం లేదని, తక్షణమే ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని జెన్‌కో సీఎండీ హరీశ్‌కు శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రం ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. శ్రీశైలం భూగర్భ జల విద్యుత్ కేంద్రం సందర్శనకు వచ్చిన సీఎండీని వారు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రెటరీ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీర్లకు, ఉద్యోగులకు జెన్‌కోలో సాధారణ బదిలీలు జరగడం లేదని, కొవిడ్ సమయంలో కూడా ఇక్కడా కష్టనష్టాలకు ఓర్చుకొని విధులు నిర్వర్తించామని పేర్కొన్నారు. పక్క రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం బదిలీలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. సీఎండీ సానుకూలంగా స్పందించి ఈ అంశాలను పరిశీలిస్తామని చెప్పారని ఆయన పేర్కొన్నారు. అనంతరం 1535 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి లవకుమార్, హెచ్ 64 యూనియన్ నాయకులు లక్ష్మయ్య ఆధ్వర్యలో ఎనర్జీ సెక్రెటరీ నవీన్ మట్టల్, సీఎండీ హరీశ్‌లను శాలువాలతో సన్మానించారు.

రాష్ట్ర స్థాయికి గుండుమాల్ క్రీడాకారుడు


రాష్ట్ర అథ్లెటిక్స్‌కు ఎంపికైన గణేష్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ ప్రతినిధులు

కోస్గి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు గణేష్ ఎంపికైనట్లు కోచ్ రాఘవేందర్, సాయికుమార్ తెలిపారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం లో బంగారు పతకం, జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌లో కంచు పతకాలు సాధించి ఆగ స్టు 14న హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

సరైన యాజమాన్యంతోనే అధిక దిగుబడులు


మంగనూర్‌లో వివిధ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న రావేఫ్ విద్యార్థులు

బిజినేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసే వివిధ పంటల్లో అధిక దిగుబడులు పొందాలంటే సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రావేఫ్ విద్యార్థులు సూచించారు. మండలంలోని మంగనూర్ గ్రామంలో శనివారం ఏజీ బీఎస్సీ చివరి సంవత్సరం రావేఫ్ విద్యార్థులు శనివారం రైతులు వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ, పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేందుకు తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. వానాకాలంలో సీజన్‌లో ఎక్కువగా సాగు చేసే పత్తి, కంది, వరి పంటలకు క్రిమి సంహారకాల పిచికారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు మంజుల, మానస, కీర్తి, పూజిత, శ్రీజ, అంకిత, స్వాతి, మౌనిక, శాంతి, అఫ్సన్ అయేషా, గొవెరియా తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

పోలీసుల అదుపులో మునిసిపల్ కార్మికులు

అయిజ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపల్ కార్మికులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండవ పీఆర్సీలో మినిమం రూ.26వేల వేతనం అమలు చేయాలని, డిమాండ్ చేస్తూ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. శనివారం శనివారం హైదరాబాద్‌లో జరిగే ధర్నాలో పాల్గొంటారని భావించి అయిజ ఎస్‌ఐ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శనివారం ముందస్తుగా కార్మికులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సొంతపూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

ధర్నాకు తరలి వెళ్లిన కార్మికులు

గద్వాల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు శనివారం జిల్లా నుంచి మునిసిపల్ వర్కర్స్ పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కనీస వేతనం రూ.26వేలతో పాటు మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ తెలిపారు. కార్యక్రమంలో మహేష్‌కుమార్, శివ, రవి ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

మల్దకల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్, కేజీబీవీ హాస్టల్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరాణి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అవసరమైన విద్యార్థులకు చికిత్స చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్ సురేశ్ గౌడు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయులు విధిగా డైరీ రాయాలి

● డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్ రెడ్డి

ధరూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉపాధ్యాయుడు విధిగా ప్రతిరోజు టీచర్స్ డైరీతో పాటు లెసన్ ప్లాన్‌ను కూడా రాసి తరగతి గదికి వెళ్లాలని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి(డీసీఈబీ) ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం ధరూర్ మండలం మార్లబీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సముదాయ సమావేశం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలస్థాయిలో పిల్లలకు చేతిరాత బాగా నేర్పించాలని చెప్పారు. ఎస్పీఎం మాడ్యుల్స్‌ను నిర్వహించాలని, ముఖగుర్తింపు (ఎఫ్ఆర్ఎస్)ను ప్రతీరోజు వందశాతం నమోదయ్యేలా చూడాలని చెప్పారు. సమావేశంలో ఎంఈవో రవీంద్రబాబు, సముదాయ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్ రాజేష్, సీఆర్పీ శేఖర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

అయిజ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి, సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. వన మహోత్సవం లో భాగంగా శనివారం అయిజ మండల పరిధిలోని ఉప్పల క్యాంపు గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ మంజుల, మాజీ సర్పంచు లక్ష్మన్న, కాంగ్రెస్ నాయకులు షైనర్‌బాబు, లాల్‌గౌడు, బసవరాజు, కృష్ణారెడ్డి, కర్రెన్న పాల్గొన్నారు.

డిగ్రీ అతిథి అధ్యాపకుల డెమో 30కి వాయిదా

గద్వాల సర్కిల్, జూల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న జరగాల్సిన అతిథి అధ్యాపకుల డెమో తరగతుల నిర్వహణ అనివార్య కారణాల వల్ల ఈనెల 30వ తేదీకి వాయిదా వేసినట్టు గద్వాల ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కలందర్‌పాష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గద్వాలలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10గంటలకు లాంగ్వేజ్, ఆర్ట్స్, కామర్స్ సబ్జెక్టులపై, మధ్యాహ్నం 2 గంటలకు సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులపై డెమో తరగతులు నిర్వహించాలని సూచించారు.

రికార్డు అసిస్టెంట్ మృతి

మానవపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయం రికార్డు అసిస్టెంట్ సురేష్ కుమార్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారని మానవపాడు పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్ తెలిపారు. కొంతకాలంగా కిడ్నీ, లివర్ సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మౌనం పాటించి నివాళి అర్పించారు.

అనుమతులు లేకుండా మట్టి తరలింపు

మానవపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద పోతులపాడు గ్రామ శివారులో అనుమతులు లేకుండా పంట పొలాల్లో శనివారం మట్టి తవ్వకాలు చేశారని, గ్రామంలో మట్టి తరలించేందుకు క్వారీలు లేవని, మైనింగ్ అధికారులతో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని ఇతర మండలాలకు తరలిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ జ్యోషి శ్రీనివాస్‌శర్మను వివరణ కోరగా అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు.

బురదమయం.. అడుగు వేయలేం



అంతంపల్లిలో మురుగు, వర్షం నీటితో నిండిన రోడ్డు



చెరువును తలపిస్తున్న మాచర్ల నుంచి బల్గెరకు వెళ్లే రోడ్డు



బస్వాపురంలోని ప్రధాన వీధిరోడ్డు దుస్థితి

● గ్రామీణ రోడ్లను పట్టించుకోని అధికారులు

గట్టు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా నిత్యం కురుస్తున్న ముసురువర్షాలతో రోడ్లపై నీరు చేరడంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ముసురు వర్షాలు రోజు కురుస్తుండటంతో రోడ్లపై నీరుచేరి పెద్దగుంతలుగా మారి నీరు ఎటూ పోకుండా నిల్వ ఉంటున్నాయి. గ్రామాల్లోని ప్రధాన వీధు ల్లోని రోడ్లు మురికి గుంటలుగా మారిపోయాయి. రోడ్లన్నీ బురదమయంగా మారడంతో పాదచారులు, వాహనదారులు, ఈరోడ్లపై జారి కింద పడ్డ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీధుల్లోకి వెళ్లాలంటే ఈ బురద గుంటలను దాటుకోని వెళ్లాల్సి వస్తున్నది. సీసీరోడ్లకు ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడంతో రోడ్లపై నీరుచేరి నిల్వ ఉంటున్నాయని గ్రామీణులు పేర్కొంటున్నారు. నిల్వ నీటిలో దోమలు చేరి రోగాల బారిన పడుతున్నామని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్

● వడ్డేపల్లి: మండల పరిధిలోని తనగల గ్రామంలో ప్రధాన రహదారి బస్టాండ్ నుంచి చర్చి వరకు వర్షపు నీటితో నీరు నిలిచిఉంది. దీంతో పాటు మురుగునీరువచ్చి చేరడంతో సమీపంలో నివశించే ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.



తనగల గ్రామ ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు

కాలనీ రోడ్లపై కదలని వాన నీరు

▸▸ పట్టించుకునేవారు లేక నిత్యం ఇబ్బందిపడుతున్న ఆయా కాలనీల ప్రజలు

గద్వాల న్యూటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న వేణుకాలనీ, సంతోష్‌నగర్ కాలనీ రోడ్డుపై ఐదు రోజులుగా ఇలా వర్షపునీరు నిలువ ఉండటంతో వాహనాదారులు, పాదచారులు పూర్తిస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈప్రాంతంలో గుంతలు ఉండటంతో వాహనదారులు ఆ నీటిగుండా వెళ్లాలంటే ఆ గుంతలతో ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక పాదచారులు ఇబ్బందులు చెప్పనవసరం లేదు. నీటికి చివరివైపులా ఇలా నడుచుకుంటూ వెళ్లాల్సిందే. అదే సమయంలో వాహనాలు వస్తే బురదమయం కావాల్సిందే అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండడం వల్ల బురద సమస్య, దోమల బెడద ఏర్పడుతున్నదని ఆయాకాలనీల వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



వాననీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారిన వేణుకాలనీలోని రోడ్డు



సంతోష్‌నగర్ కాలనీలో ప్రధాన రోడ్డుపైనే నిలిచిన వర్షపునీరు

వర్షాలకు ప్రత్యేక టీంలతో ముందస్తు జాగ్రత్తలు

▸▸ అధికారుల సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రత్యేక టీంలతో ముందస్తు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ బీఎం అన్నారు. శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేక అధికారి జి. రవి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై కలెక్టర్, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్ స్పందిస్తూ మాట్లాడుతూ జిల్లాలో మామూలు సాధారణ వర్షపాతం నమోదైనదని, ప్రమాదకరమైన పరిస్థితులు లేవన్నారు. అయినప్పటికి జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. వర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న పాతగృహాలు, పాఠశాలలు, కళాశాలలను గుర్తించి నివారణ చర్యలు చేపడతామన్నారు. వర్షాలవల్ల దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులను సంబంధిత అధికారులు చేపడతారన్నారు. కృష్ణా, తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో నీటిప్రవాహాన్ని ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా పైప్ లైన్ లీకేజీలను సరిచేయడంతో పాటు క్లోరినేషన్ చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాలు, మునిసిపాలిటీలలో పారిశుధ్య పనులు చేపడతామన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్నివిధాలుగా అప్రమత్తంగా ఉంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, అధికారులు ఉన్నారు.

పెండింగ్ భూ సేకరణ ప్రక్రియను పూర్తిచేయాలి

జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పెండింగ్ ఆయకట్టు భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు(కుడికాలువ)కు సంబంధించి భూ సేకరణ పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. భూ సేకరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే రైతులకు నోటీసులు అందజేయడం జరిగిందున, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం క్రింద 99/బి, 100 ప్యాకేజీ క్రింద మంజూరైన చెక్కులను అందజేసి భూములను వెంటనే స్వాధీనం చేసుకొని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖ డీఈ, ఏఈలు, గద్వాల, ధరూర్ తహసిల్దార్లు మల్లికార్జున్, నరేందర్ ఉన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గిరిజన బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

గద్వాల సర్కిల్/ ఎర్రవల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థినుల ఆరోగ్య భద్రత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. గద్వాల మండలం పుటాన్‌పల్లి గ్రామస్టేజీ సమీపంలో ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పరిసరాలను, రికార్డులను, వంట గదిని, వసతులను పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. భోజనం, శుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ సుచిత్రను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

● ఎర్రవల్లి : సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. కొండేరు గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లోని ఆశావర్కర్ల దగ్గర అన్నిరకాల సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని చెప్పారు. అనంతరం కొండేరు గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి సిద్దప్ప, డాక్టర్ రాధిక, హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు సోమనాద్రి ఉన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలి అంజన్నా..



ఎద్దుల బండిపై కలశం, ఫలహారం ఊరేగింపు

అయిజ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ అయిజలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఎద్దుల బండ్లపై కలశం, ఫలహారాలను ఊరేగింపుగా గద్వాల రహదారిలోని కట్ట కిందస్వామి ఆలయానికి తీసుకెళ్లారు. ముందుగా జ్యోతి ఊరేగింపు వెళ్లగా, వెనుక బాజాభజంత్రీలతో ఎద్దుల బండ్లు సాగాయి. కట్ట కిందస్వామికి తుంగభద్ర, కృష్ణానది జలాలతో అభిషేకం, ఫలహారాలతో ప్రత్యేక పూజలు చేశారు.

శ్రావణమాసంలో మొదటి శనివారం ఈ కార్యక్రమం నిర్వహించటం సాంప్రదాయంగా వస్తున్నదని రైతులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

● జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర

గద్వాల క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు మహిళలకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర ఆధ్వర్యంలో అరుదైన శస్త్రచికిత్స చేశారు. జిల్లా కేంద్రంలోని గంజిపేట కాలనీకి చెందిన శంకరమ్మ 20ఏళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఆమెకు హెర్నియా ఆపరేషన్ చేసి కడుపులో ముడుచుకుపోయిన పేగులను సరిచేశామని డాక్టర్ ఇందిర తెలిపారు. అలాగే గద్వాల పట్టణంలోని దౌదర్‌పల్లికి చెందిన పల్లవికి సిజేరియన్ చేశాక, పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో శస్త్రచికిత్స చేశామని తెలిపారు.

ఇద్దరు మహిళలు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఈ ఆపరేషన్లలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు డాక్టర్లు శఫి, ఉదయ్, భాస్కర్, విపంచి, కేచరి, స్పందన, వైష్ణవి, హర్షవర్ధన్ ఉన్నారు.

మోటార్ వైండింగ్ షాపులో చోరీ

మల్దకల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పాత బస్టాండ్‌లోని రంగప్ప, నన్నుబాషాకు చెందిన మోటార్ వైండింగ్ షాపుల్లో చోరీ జరిగింది. రంగయ్యకు షాపులో రూ.లక్ష నగదుతో పాటు మోటార్ వైండింగ్ సామాన్లు, నన్నుబాషా దుకాణంలో మోటార్, సామాన్లు అపహరించారని, మొత్తం 5లక్షల విలువైన వస్తువులు చోరీ అయ్యాయని దుకాణ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నందికర్ తెలిపారు.

కూల్‌డ్రింక్ దుకాణంలో చోరీ

ఇటిక్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదండాపురంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగిందని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన ఖాజామియ్య, శేషంపల్లి క్రిష్టారెడ్డికి చెందిన కూల్‌డ్రింక్ దుకాణం పైకప్పు రేకులు తొలగించి, షాపుల్లోని రూ.పదివేల వరకు నగదును చోరీ చేశారని ఎస్సై తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాబులపై కేసు నమోదు

అలంపూరుచౌరస్తా, జూలై26 (ఆంధ్రజ్యోతి): తన హోటల్‌లో మద్యం తాగవద్దని చెప్పినందుకు యజమానిపై దాడి చేసిన వ్యక్తులకు కేసు నమోదు చేశామని ఎస్సై శేఖర్ తెలిపారు. ఉండవల్లి మండల కంచుపాడుకు చెందిన విక్రమాచారి, విజయలక్ష్మి దంపతులు టోల్‌ప్లాజా సమీపంలో హోటల్ నడుపుతున్నారు. ఈనెల 23న కర్నూలుకు చెందిన సోయెల్, జగదీష్, జయంత్ హోటల్‌కు వచ్చి కూల్‌డ్రింక్స్ ఆర్డర్ చేశారు. వెంట తెచ్చుకున్న మద్యం తాగేందుకు ప్రయత్నించగా వద్దన్నందుకు విక్రమాచారిపై దాడి చేస్తుండగా భార్య విజయలక్ష్మి, పక్క హోటల్ వారు వచ్చి విడిపించారు.

అయిజ కొత్త బస్టాండ్ ఆధునికీకరణ



అయిజ కొత్త బస్టాండులో ఆర్టీసీ గద్వాల డీఎం సునిత

▸▸ ఆర్టీసీ గద్వాల డీఎం సునీత

అయిజ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అయిజ కొత్తబస్టాండును ఆధునికీకరణ చేస్తామని ఆర్టీసీ గద్వాల డీఎం సునీత తెలిపారు. శనివారం ఆమె బస్టాండును పరిశీలించారు. వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. బస్టాండులో వర్షంనీరు నిల్వ ఉండకుండా సీసీ వేయిస్తామన్నారు. ఈ సందర్భంగా బళ్లారి బస్సును పునరుద్ధరించాలని, అయిజ నుంచి గద్వాల మీదుగా శ్రీశైలానికి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు ఆమెను కోరారు. అందుకు ఆమె అనుకూలంగా స్పందించారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతీ ఆదివారం, సోమవారం రాయలసీమలోని ఉరుకుంద ఈరన్న ఆలయానికి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గద్వాల కంట్రోలర్ పర్వతరెడ్డి, అయిజ కంట్రోలర్ కృష్ణ, అమర్‌నాథ్, కండక్టర్ సురేశ్ పాల్గొన్నారు.

99వ ప్యాకేజీలో పెండింగ్ భూసేకరణ పూర్తి చేయండి

గద్వాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. శనివారం భూసేకరణ, పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగమైన గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నుంచి వచ్చే 99, 99బీ, 100వ ప్యాకేజీలలో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి భూసేకరణ చేయాల్సి ఉందని దానిని వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని ఆయన సూచించారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం కింద చెక్కులను అందించాలని ఆయన సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, భూసేకరణ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈలు, ఏఈలు, గద్వాల, ధరూర్ తహశీల్దార్‌లు మల్లికార్జున్, నరేందర్‌లు పాల్గొన్నారు.

సీడ్ పత్తి రైతులకు వెంటనే చెల్లింపులు చేయాలి

● ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్

గద్వాల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సీడ్ పత్తి రైతులకు గతఏడాది పండించిన పంటకు సంబంధించి చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. కంపెనీల పేరుతో ఆర్గనైజర్లు ఆడుతున్న నాటకానికి తెరదించాలన్నారు. శనివారం పట్టణంలోని సమితి కార్యాలయంలో విలేకరులతో రంజిత్‌కుమార్ మాట్లాడారు. గడచిన ముప్పై ఏళ్లుగా పలురకాలుగా రైతులను మోసగిస్తూ దోపిడీకి పాల్పడుతున్న ఆర్గనైజర్లు ఇప్పటికీ తమ వైఖరిని మార్చుకోక పోవడం గర్హనీయమన్నారు. ఈఏడాది సీడ్ ఉత్పత్తి కొనుగోలుపై అసంబద్ధమైన ఆంక్షలకు దిగిన ఆర్గనైజర్లు కలెక్టర్ సమక్షంలో జరిపిన చర్చల సందర్భంగా చేసుకున్న ఒప్పందాలను సైతం ఉల్లంఘిస్తుండటం గర్హనీయమన్నారు. పంట చేతికి వచ్చిన మూడు నెలల్లోగానే చెల్లింపులు జరపాల్సి ఉండగా ఏడాది కావస్తున్నా గత సంవత్సరానికి చెందిన పంట ఉత్పత్తులకు ఇప్పటికీ చెల్లింపులు చేయకపోవడం మోసమేనన్నారు. వెంటనే చెల్లింపులు జరపకపోతే తమ సమితి ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు విష్ణు, గోపాల్, చిన్నరాముడు, శాంతన్న, లక్ష్మన్న ఉన్నారు.

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

గద్వాల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన మండలాల్లో పూర్తిస్థాయి కార్యాలయాలు లేకపోగా ఉన్న వాటిని సైతం ఇరుకు గదుల్లో కొనసాగిస్తుండటం విచారకరమన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం ఆంజనేయులు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పాలనలో సంపదను సృష్టిస్తున్న 80శాతం మంది ప్రజలు ఆర్థిక సంక్షోభంలో ఉండగా, సంపద అంతా ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాల చేతిలో కేంద్రీకృతం కావడం దౌర్భాగ్యమన్నారు. మతపరమైన రాజకీయాలు దేశ పురోగతికి విఘాతం కలిగిస్తాయన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. అన్నివర్గాల అభ్యున్నతి, సమాజ పురోగతి, శ్రామికులకు న్యాయం ప్రధాన అజెండాలుగా ఏర్పడిన సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 7, 8వ తేదీల్లో గద్వాల జిల్లాలో మూడవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు సిద్ధం కావాలన్నారు. ఈసందర్భంగా గద్వాల మండలం సీపీఐ నూతన కమిటీని ఏర్పాటుచేశారు. కార్యదర్శిగా కాశీం, సహాయ కార్యదర్శులుగా వెంకటేష్, వెంకటరాముడు, ఫాదర్‌పాషా, వెంకటేష్, మరో ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా, 15 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రంగన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న, ధర్మన్న, మస్తాన్, ప్రభుదాస్ ఉన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

అలంపూరుచౌరస్తా, జూలై26 (ఆంధ్రజ్యోతి): అలంపూరు చౌరస్తాలో అలంపూరు వెళ్లే మార్గానికి ఇరువైపులా ఉన్న సర్వేనెంబరు 250/సీ లో ఉన్న సీలింగ్ ల్యాండ్‌లో కొంతకాలంగా అక్రమ కట్టడాలు, షెడ్లు నిర్మిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు ప్రభాకర్ తన సిబ్బందిని పంపారు. ఆర్‌ఐ నాగరాజు, సిబ్బంది అక్కడ నిర్మిస్తున్న కట్టడాలను తొలగించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సదరు భూమిలో ఎవరైన కట్టడాలు కానీ షెడ్లు కానీ నిర్మిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామని తహసీల్దారు హెచ్చరించారు.

పనిగంటల పెంపు జీవోను ముక్తకంఠంతో వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం

● టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం

గద్వాల టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కనీస వేతనాల అమలు గురించి పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ ఆగమేఘాల మీద జీవో విడుదల చేయడం దుర్మార్గమని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యం అన్నారు. జీవోను వ్యతిరేకిస్తూ ఈనెల 31న తలపెట్టిన ఆందోళనను జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించిన టీయూసీఐ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. 2022లో విడుదలైన ఐదు కనీస వేతనాల పెంపు జీవోల గురించి ఇప్పటికీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంతో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు 2లక్షల మందికి పైగా ఉన్న వారికి సామాజిక భద్రత కరువైందన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు వృద్ధాప్యంలో పెన్షన్ కనీసం రూ.90వేలు చెల్లించాలని, ఆటోమొబైల్ రంగం, మిల్లులు, హమాలీల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇందుకోసం ఈ 31వ తేదీ గురువారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ఆందోళనలో అన్నిరంగాల కార్మికులు పాల్గొనాలన్నారు. సమావేశంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, కార్యదర్శి చింతరేవుల కృష్ణ, నాయకులు సలీం, ప్రేమరాజ్, బీచుపల్లి, రంగన్న, మహేశ్వరి, శంకరన్న, మార్లబీడు హనుమంతు, భీమన్న, రాజు, సిద్ధయ్య ఉన్నారు.